వైభవంగా దుర్గామల్లేశ్వరి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం

అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పర్వత్‌నగర్ దుర్గామల్లేశ్వరి అమ్మవారి ఆలయ 22వ వార్షికోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ సబీహాబేగం, కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేశ్, బీజేపీ మేడ్చల్ అర్బన్ సెక్రటరీ పులిగొల్ల శ్రీనివాస్ యాదవ్‌లు హాజరయి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- అల్లాపూర్, ఫిబ్రవరి 15

దళితులపై దాడులకు పాల్పడిన వారిని శిక్షించాలి..

దుండిగల్, ఫిబ్రవరి 15 : జన్వాడ దళితులపై మూకదాడులకు పాల్పడిన మతోన్మాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి(కేవీపీఎస్) రాష్ట్ర కమిటీ నాయకులు నాగనిగల్ల బాలపీరు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రహదారి విషయంలో అగ్గి రాజేసి ఒక పథకం ప్రకారం దళితులపై దాడులకుదిగి ఇద్దరి తలలు పగులగొట్టిన నిందితులను ప్రభుత్వం వెంటనే అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించాలన్నారు. ఈ దాడుల వెనక మతోన్మాద పెత్తందార్లు ఉన్నారని ఆరోపించిన ఆయన వారిపైనా తగు చర్యలు చేపట్టాలన్నారు. అదే సమయంలో గ్రామంలోని దళితులకు రక్షణ కల్పించాలని కోరారు. గాయాలపాలైన వారికి ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించాలన్నారు. దాడులకు పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.



మియాపూర్ డివిజన్, నడిగడ్డ తండాలో సేవాలాల్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, తదితరులు

బాలాజీనగర్‌లో సంత్ శ్రీ సేవాలాల్ చిత్రపటానికి పూలతో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, తదితరులు

సేవాలాల్ మహరాజ్ బోధనలు స్ఫూర్తిదాయకం..

- ఎమ్మెల్యేలు అరెకపూడి గాంధీ, మాధవరం కృష్ణారావు
- పలు ప్రాంతాల్లో ఘనంగా సేవాలాల్ జయంతి వేడుకలు

మియాపూర్, ఫిబ్రవరి 15: భారత సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణతోపాటు హిందూధర్మ స్థాపనలో సేవాలాల్ మహరాజ్ కృషి ఎనలేనిదని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. గురువారం సేవాలాల్ మహారాజ్ 285వ జయంతిని పురస్కరించుకుని మియాపూర్ డివిజన్, నడిగడ్డ తండాలో బంజారా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సంఘం ప్రతినిధులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనుల ఆరాధ్య దైవం, వారి అభ్యున్నతి , శ్రేయస్సు కోసం అలుపెరగని పోరుసల్పిన మహనీయుడు సేవాలాల్ అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. గిరిజనుల సంక్షేమం కోసం తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ విశేష కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో స్వామి నాయక్, తిరుపతినాయక్, హన్మంతు నాయక్, సీతారాం, దశరథ్ నాయక్, తుకారాం, లక్ష్మణ్, కృష్ణ, గోపి, చందు, తదితరులు పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో బీఆర్ఎస్ నేత కొలన్ గోపాల్‌రెడ్డి, కార్పొరేటర్ బాలాజీనాయక్, తదితరులు

కేపీహెచ్‌బీ కాలనీలో..

కేపీహెచ్‌బీ కాలనీ: బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ బోధనలు స్ఫూర్తిదాయకమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం బాలాజీనగర్ డివిజన్ సేవాలాల్‌నగర్‌లో.. అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్‌లలో జరిగిన సంత్ శ్రీ సేవాలాల్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఆర్డీవో శ్యాంప్రకాశ్, కూకట్‌పల్లి తాసీల్దార్ స్వామి, కార్పొరేటర్ సతీశ్ గౌడ్, బంజారా పాల్గొన్నారు.

బాలాజీనగర్ డివిజన్‌లో..

బాలాజీనగర్ డివిజన్, సేవాలాల్‌నగర్‌లో జరిగిన సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకల్లో మాజీ కార్పొరేటర్ పగుడాల బాబూరావు , నేతలు హరినాథ్, శంకర్ నాయక్, కైలా నాయక్, హైమావతి, భీమ్‌రావు, స్వామిగౌడ్, వెంకట్రావ్, సుశీల్‌కుమార్ తదితరులున్నారు.

కొండాపూర్‌లో..

కొండాపూర్: బంజారాల ఆరాధ్య దైవం సద్గురు సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని పురస్కరించుకుని గురువారం చందానగర్ హుడా కాలనీలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మియాపూర్ కార్పొరేటర్ శ్రీకాంత్, చందానగర్ డివిజన్ అధ్యక్షులు రఘునాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దుండిగల్‌లో..

దుండిగల్: సంత్‌సేవాలాల్ జయంతి వేడుకలు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో ఘనంగా జరిగాయి. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, 20వ డివిజన్ కార్పొరేటర్ బాలాజీనాయక్ ఆధ్వర్యంలో బాచుపల్లిలో జరిగిన సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో సీనియర్ బీఆర్ఎస్ నాయకులు కొలన్ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ నేతలతోపాటు నిజాంపేట్ కార్పొరేషన్ బంజారసేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు సైతం సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో పాల్గొని నివాళులర్పించారు.

అల్లాపూర్‌లో..

అల్లాపూర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పర్వత్‌నగర్ కమ్యూనిటీహాల్ లో డివిజన్ ఎస్టీ సెల్ నాయకుల ఆధ్వర్యంలో గురువారం సంత్‌సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సబీహాబేగం, బీఆర్ఎస్ నాయకులు,ఎస్టీ సెల్ నాయకులు బద్రునాయక్, గోపాల్ నాయక్, కళ్యాణ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

వద్దిరాజు రవిచంద్రకు శుభాకాంక్షలు

బీఆర్ఎస్ పార్టీ రాజ్యసభ సభ్యుడిగా నామినేషన్ దాఖలు చేసిన వద్దిరాజు రవిచంద్రకు రాష్ట్ర మున్నూరుకాపు సంఘం నేతలు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ మున్నూరు కాపులకు రాజ్యసభ సీటును కేటాయించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్యపటేల్, గౌరవ అధ్యక్షుడు గాంధీ, రాష్ట్ర కార్యదర్శి తేళ్ల హరికృష్ణ, మురళి, వెంకటేశ్వర్లు, శివ తదితరులున్నారు.

- కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 15

బోధనా నైపుణ్యతను అభివృద్ధి చేసేందుకు కృషి ..

'కేఎల్ డీమ్డ్' వర్సిటీ వైస్ ప్రెసిడెంట్ కోనేరు లక్ష్మణ్

ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో కేఎల్ గ్లోబల్ బిజినెస్ స్కూల్ అధ్యాపక బృందం

మాదాపూర్, ఫిబ్రవరి 15: కేఎల్‌హెచ్ గ్లోబల్ బిజినెస్ స్కూల్ యొక్క సీఎస్ఆర్ క్లబ్ ఫిలాంత్రోప్రోస్ రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కళాశాల గర్ల్స్‌కు అంకితా భావంతో కూడిన అధ్యాపకుల కోసం గురువారం వినూత్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ కోనేరు లక్ష్మణ్.. యూనివర్సిటీ అధ్యాపక బృందంతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాలతో బోధనా నైపుణ్యతను అభివృద్ధి చేసేందుకు, సహాయపడేందుకే కాకుండా ప్రతి విద్యార్థి తమపూర్తి సామర్థ్యాన్ని సాధించడానికి దోహదపడనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యాలు, ప్రేరణను మెరుగుపరచడం, టీఎస్ డబ్ల్యూఆర్ఎస్, జేసీ విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చడం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం యొక్క లక్ష్యమన్నారు. కేఎల్ హెచ్ బిజినెస్ స్కూల్ విద్యార్థులల్లో సామాజిక బాధ్యతను, సంస్కృతిని ప్రోత్సహింస్తుందన్నారు.

పేద విద్యార్థులకు చేయూత.. అభినందనీయం

ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 15 : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థుల ఉన్నత విద్యకోసం చేయూతనందిస్తున్న ఆలివ్ స్వీట్స్ అధినేత దొరరాజు అందిస్తున్న సేవలు అభినందనీయమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం కూకట్‌పల్లి పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ.. అత్యుత్తమ ప్రతిభను కనబర్చిన 15 మంది విద్యార్థులను దొరరాజు సాఫ్ట్‌వేర్ కంపెనీలు, టీహబ్, ఇండియన్ బిజినెస్ స్కూళ్ల సందర్శనకు తీసుకెళ్లారు. ఈ టూర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దొరరాజు కూకట్‌పల్లి పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ పదో తరగతిలో 10/10 జీపీఏ పాయింట్లు సాధించిన విద్యార్థులకు బహుమతులను అందిస్తూ ప్రోత్సహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, ఎంఈవో ఆంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

సాఫ్ట్‌వేర్ కంపెనీల సందర్శనకు వెళ్తున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

ఆలయ వార్షిక వేడుకలకు హాజరుకావాలి..

దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో ఈనెల 19 నుంచి జరిగే శ్రీదాసాంజనేయస్వామి ఆలయ వార్షిక వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్‌రాజును కలిసి ఆహ్వానపత్రం అందజేశారు.. ఈ మేరకు ఆలయ కమిటీ ప్రతినిధులు గురువారం శంభీపూర్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయంలో ఆయనను కలిసి ఆహ్వానించారు. అదే విధంగా ఈనెల 16నుంచి 20వరకు గాజులరామారంలో జరిగే రేణుకాఎల్లమ్మ దేవి జాతరలో పాల్గొనాలంటూ ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్సీని కలిసి ఆహ్వానపత్రం అందజేశారు.

- దుండిగల్, ఫిబ్రవరి 15

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన..

దుండిగల్, ఫిబ్రవరి 15 : గాజులరామారం డివిజన్, భవానీనగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు స్థానిక కార్పొరేటర్ రావుల శేషగిరి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్తీలు, కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భవానీనగర్ సంక్షేమ సంఘం డీవీ గోపాలకృష్ణ, సభ్యులు ప్రతాపరెడ్డి, చంద్రశేఖర్, వెంకటకల్యాణ్, ఆదిశేషు, వెంకటస్వామి, ప్రసాద్, రాజు, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ ఇమ్యూనో థెరపీపై అవగాహన సదస్సు

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 15 : క్యాన్సర్ అవగాహన మాసంలో భాగంగా గురువారం గచ్చిబౌలిలోని కాంటినెంటల్ దవాఖానలో 'క్యాన్సర్ ఇమ్యూనో థెరపీ'పై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో అంతర్జాతీయ పరిశోధకులు పాల్గొని ఇమ్యూనో అంకాలజీలో అడ్వాన్సెస్ అంశంపై ఇంటరాక్టివ్ సెషన్‌లో పాల్గొని చర్చించారు. క్యాన్సర్ పరిశోధన రంగంలో ఇమ్యూనోథెరపీ అపోహాలను తొలగించడమే లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు క్యాన్సర్ పరిశోధకులు డాక్టర్ కీత్ ప్లాహెర్టీ, డాక్టర్ రమీ ఇబ్రహీంలు పేర్కొన్నారు. ప్రజల్లో క్యాన్సర్ పట్ల తగు అవగాహన కల్పించి, వ్యాధి ప్రథమ దశలో గుర్తిస్తే సులభంగా నయం చేయగలిగే వైద్య విధానాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏవీఎస్ సురేశ్, డాక్టర్ ఇబ్రహీం, డాక్టర్ జగన్నాథ్, డాక్టర్ గురు ఎన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమ్మెను విజయవంతం చేయండి..

గాంధీనగర్‌లో ఐఎన్‌టీయూసీ నేతల ప్రచారం

జగద్గిరిగుట్ట, ఫిబ్రవరి 15 : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన నల్లచట్టాలను తిప్పికొడదామని ఐఎన్‌టీయూసీ నేతలు కోరారు. దేశవ్యాప్తంగా శుక్రవారం జరిగే కార్మిక జాతీయ సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం రంగారెడ్డినగర్ డివిజన్, గాంధీనగర్ పారిశ్రామికవాడలో ప్రచారం చేపట్టారు. అనంతరం జగద్గిరిగుట్ట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ప్రజావ్యతిరేక చట్టాలతో కార్పొరేట్ సంస్థలు లాభపడుతున్నాయని ఆరోపించారు. పారిశ్రామిక, వ్యవసాయ రంగాల కార్మికులు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతున్నారని విమర్శించారు. కేంద్రానికి తగిన గుణపాఠం చెప్పేలా జరిగే సమ్మెలో కార్మికులు, ప్రజాస్వామ్యవాదులు పాల్గొని మద్దతు నిలవాలని కోరారు. శుక్రవారం ఐడీఎల్ నుంచి జీడిమెట్ల పారిశ్రామికవాడవరకు బైక్‌ర్యాలీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఐలయ్య, వరమ్మ, సంఘం నేతలు పాల్గొన్నారు.

గ్రామీణ బంద్‌ను జయప్రదం చేద్దాం

దుండిగల్, ఫిబ్రవరి 15 : దేశవ్యాప్తంగా జరిగే 'గ్రామీణ బంద్'ను జయప్రదం చేద్దామని కుత్బుల్లాపూర్ మండలం సీఐటీయూ కన్వీనర్ కీలుకాని లక్ష్మణ్ అన్నారు. గురువారం షాపూర్‌నగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో జరిగిన తెలంగాణ ఆటోడ్రైవర్స్ యూనియన్, షాపూర్‌నగర్ మార్కెట్ స్టాండ్ డ్రైవర్స్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు,కార్మిక, ప్రజావ్యతిరేక, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా, అదే సమయంలో ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణకోసం శుక్రవారం జరిగే గ్రామీణ భారత్‌బంద్, పారిశ్రామిక సమ్మెను కార్మికలోకంతోపాటు కర్షకులు, ప్రజలు జయప్రదం చేయాలన్నారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా షాపూర్‌నగర్ రైతు బజార్ నుంచి జీడిమెట్ల పారిశ్రామికవాడ మీదుగా సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, ఐఎన్‌టీయూసీ, సీబీఆర్‌టీయూ సంఘాల ఆధ్వర్యంలో జరిగే భారీ ర్యాలీలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నేతలు, కార్మికులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలకు నోటీసుల జారీ ..

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 15 : కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో గత కొంత కాలంగా అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. అనుమతుల కుమించి నిర్మాణాలు ఒకవైపు అయితే అక్రమంగా కమర్షియల్ నిర్వహణ కోసం మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండా ఇష్టానుసారంగా నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మున్సిపాలిటీ కమిషనర్ శ్రీహరి ఆదేశాల మేరకు గురువారం కొంపల్లిలోని జయభేరి, దూలపల్లి, పోచమ్మగడ్డ, జయసింహారెడ్డి కాలనీతోపాటు దూలపల్లి ఇండస్ట్రీయల్ ఏరియాలో కొనసాగు తున్న అక్రమ నిర్మాణాలు, షెడ్డు నిర్మాణదారులకు నోటీసులను టౌన్‌ప్లానింగ్ సిబ్బంది అందజేశారు.

మెకానిక్ నిర్లక్ష్యం.. సెక్యూరిటీ గార్డు మృతి

జీడిమెట్ల, ఫిబ్రవరి 15: ఓ మెకానిక్ నిర్లక్ష్యంతో సెక్యూరిటీ గార్డు మృతి చెందాడు. ఈ సంఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.... చింతల్ అగ్రో ఫెస్టిసైడ్ సమీపంలో రాఘవేంద్ర మోటార్ ఎంటర్ ప్రైజెస్‌లో మెకానిక్‌గా ఎండి. ఇమ్రాన్ పని చేస్తున్నాడు. గురువారం గ్యారెజ్‌లోని కారును వేగంగా తీస్తుండగా అక్కడే ఉన్న సెక్యూరిటీ గార్డు కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన శివయ్య (65)ను ఢీకొనడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ప్రార్థనమందిరం వార్షిక వేడుకలు

దుండిగల్, ఫిబ్రవరి 15 : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, రాజీవ్‌గృహకల్ప సముదాయంలోని ఇమ్మానియేలు ప్రార్థన మందిరం 14వ వార్షిక వేడుకలు బుధవారం రాత్రి ఘనంగా జరిగాయి. వేడుకలకు అంతర్జాతీయ ప్రసంగీకులు డా.జో రివైవల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రైస్తవులకు తన దైవ సందేశం వినిపించిన అనంతరం ఇమ్మానియేలు ప్రార్థన మందిరం పాస్టర్ సిరిగల బాలరాజుతో కలిసి కేక్‌కట్ చేశారు. అనంతరం వేడుకల్లో పాల్గొన్న వారితో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు దైవజనుల తోపాటు క్రైస్తవులు పాల్గొన్నారు.

పాఠశాల గ్రౌండ్ స్థలంలో వాటర్‌ఫిల్లింగ్ స్టేషన్ వద్దు

పనులను అడ్డుకుని, ఆందోళన చేస్తున్న బాచుపల్లి జెడ్‌పీహెచ్ఎస్ విద్యార్థులు

దుండిగల్, ఫిబ్రవరి 15: ప్రభుత్వ పాఠశాల గ్రౌండ్ స్థలంలో వాటర్‌ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటు చేయొద్దంటూ విద్యార్థులు ఆందోళనకు దిగి పనులను అడ్డుకున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, బాచుపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(జెడ్‌పీహెచ్ఎస్)కు సంబంధించిన ప్లే గ్రౌండ్‌లో ఎకరం స్థలాన్ని అధికారులు హెచ్ఎండబ్ల్యూఎస్‌బీ(జలమండలి) వాటర్ ఫిల్లింగ్ స్టేషన్ నిర్మాణం కోసం గతంలోనే కేటాయించారు. ఈ క్రమంలో గురువారం పనులు మొదలుపెట్టేందుకు ప్రయత్నించగా విద్యార్థులు అడ్డుకున్నారు. జేసీబీకి అడ్డుగా నిలిచి పనులను నిలిపివేసేదాక అక్కడినుంచి కదలమని భీష్మించారు. ఇప్పటికే తమకు సరిపడా క్రీడా స్థలం లేకపోవడంతో ఔత్సాహిక విద్యార్థులు ఇబ్బందులు పడుతుండగా, మళ్లీ ఉన్న దాంట్లో ఎకరం స్థలం జలమండలి ఫిల్లింగ్ కేంద్రానికి కేటాయిస్తే తమ భవిష్యత్ ఏమిటని విద్యార్థులు ప్రశ్నించారు. పాఠశాల ముందు ప్రధాన రహదారి ఉండటంతో వాహనాల రాకపోకలు, అవిచేసే శబ్దాల కారణంగా ఏకాగ్రతతో చదువలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక వాటర్‌ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటుతో వాటర్‌ట్యాంకర్ల రాకపోకలతో పరిస్థితి ఎంత దుర్భరంగా ఉంటుందో ఊహిస్తేనే భయమేస్తోందని వాపోయారు. అధికారులు ఇప్పటికైనా ఆలోచించి సముచిత నిర్ణయం తీసుకోవాలన్నారు. లేకపోతే విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో పడే అవకాశముందున్నారు. కాగా విద్యార్థుల ఆందోళనతో పనులను తాత్కాలికంగా నిలిపివేశారు.

ఔత్సాహిక కళాకారులకు ప్రోత్సాహం..

కొండాపూర్, ఫిబ్రవరి 15 : ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహించడంతోపాటు వారిలో ఉత్పన్నమయ్యే పలు సందేహాలకు పరిష్కారాలతోపాటు చక్కని సలహాలు, సూచనలను సీనియర్ ఆర్టిస్ట్ ప్రభాకర్ కోల్టె గురువారం మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన ఆర్ట్ టాక్‌లో అందించారు. ఢిల్లీకి చెందిన ప్రభాకర్ కోల్టె ..జేజేఎఫ్ స్కూల్ ఆఫ్ ఆర్ట్‌లో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహించి, ఎంతో మంది విద్యార్థులను ఆర్టిస్ట్‌లుగా తీర్చిదిద్ది.. 'న్యూస్ ది ఆర్ట్ ఫెస్ట్' పేరిట ఏర్పాటు చేసిన టాక్ షోలో పాల్గొని యువ కళాకారులను ఉద్దేశించి ప్రసంగించారు. తన అనుభవాలను తెలుపుతూ, యువ కళాకారులకు అవసరమైన సలహాలను, సూచనలను అందించారు. టాక్ షోకు హాజరైన కళాకారులు తమ ప్రశ్నలను నివృత్తి చేసుకున్నారు. ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన ఆర్ట్ క్యాంపు ఈ నెల 17 వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

చెరువులను పరిశీలించిన కమిషన్ బృందం..

చెరువులను పరిశీలించిన అనంతరం వివరాలు తెలుసుకుంటున్న అడ్వకేట్ కమిషన్ బృందం

మియాపూర్/శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 15 : తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు అడ్వకేట్ కమిషన్ బృందం గురువారం శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని పలు చెరువులను పరిశీలించింది. రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల నేపథ్యంలో దుర్గం చెరువు, సున్నం చెరువు , మేడికుంట చెరువు, గోసాయి కుంట, పెద్ద చెరువు, గంగారం పెద్ద చెరువులను జీహెచ్ఎంసీ, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో కలిసి కమిషన్ బృందం పరిశీలించింది. ప్రధానంగా చెరువులు అన్యాక్రాంతం కాకుండా చేపడుతున్న చర్యలు, ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్‌ల గుర్తింపు , చెరువుల చుట్టూ కంచె ఏర్పాటు, వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణం సహా పలు అంశాలను జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, రెవెన్యూ విభాగాలతో కలిసి పరిశీలించింది. విలువైన చెరువు స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో....అన్యాక్రాంతం కాకుండా సంబంధిత విభాగాల చర్యలను బృందం క్షుణ్ణంగా పరిశీలించింది. క్షేత్రస్థాయి పరిశీలనపై సమగ్ర నివేదికను ఉన్నత న్యాయ స్థానానికి నివేదిస్తామని అడ్వకేట్ కమిషన్ న్యాయవాది ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన వెంట రెవెన్యూ విభాగం జీపీ శ్రీకాంత్‌రెడ్డి, అధికారులున్నారు.

చందానగర్‌లో విద్యార్థుల అదృశ్యం

రాజేశ్, జగన్(ఫైల్)

కొండాపూర్, ఫిబ్రవరి 15 : ఇద్దరు చిన్నారులు అదృశ్యమైన సంఘటన చందానగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎంఐజీలో కొనసాగుతున్న ఎస్ఓఎస్ చిల్డ్రన్ విలేజ్ యూత్ హౌజ్ బ్రాంచ్‌లో ఉంటూ స్థానికంగా బీహెచ్ఎల్ జెడ్‌పీహెచ్ ఎస్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న రాజేష్ (17), 8వ తరగతి చదువుతున్న బి.జగన్ (14)లు ఈ నెల 13న స్కూల్‌కు వెళ్లి తిరిగి రాలేదు. నిర్వాహకులు స్థానికంగా గాలించినా, తెలిసిన వారిని, స్నేహితులను ఆరా తీయగా ఎలాంటి సమాచారం అందలేదు. దీంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి...

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 15 : కారు ఢీకొన్న ఘటనలో తీవ్ర గాయాలైన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం...గుండ్లపోచంపల్లి ఎస్సీ కాలనీకి చెందిన జోగిళ్ల శివయ్య(55) గత నెల 16న ఉదయం 11 గంటల సమయంలో తన ఇంటి ముందు కూర్చొని ఉన్నాడు. ఈ క్రమంలో అదే కాలనీకి చెందిన మరో వ్యక్తి తన కారులో వెళ్తుండగా ఇంటి ముందు కూర్చొని ఉన్న శివయ్యను ఢీకొట్టడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు అతడిని గాంధీ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద